


దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. లోక సంరక్షణార్థం, సర్వ మానవాళికి సేవ చేస్తారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటిమట్టం ఆదివారం 513.40 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహరి (మంగళ)
బాపట్ల	6.26	4.46
నరసరావుపేట	6.28	4.48
గుంటూరు	6.26	4.46

చంద్రబాబు ఫ్లాప్ షో

- ప్రజాగళానికి స్పందన కరువు
- జనం కోసం గంటన్నర వేచి చూసిన బాబు
- జనం రాకపోగా ఉన్నవారూ వెనుదిరిగిన పరిస్థితి
- విషయం తెలుసుకొని సభకు వచ్చిన బాబు
- అప్పటికే నామమాత్రంగా జనం
- బాబు సభ అంచనాలు తల్లకిందులు



బాపట్లలో జనం లేక వెలవెలబోయిన చంద్రబాబు ప్రజాగళం సభ

సాక్షి ప్రతినిధి, బాపట్ల: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ప్రజాగళానికి స్పందన కరువైంది. బాపట్లలో ఆదివారం రాత్రి నిర్వహించిన సభకు జనం రాకపోవటం, వచ్చిన కొద్దిమంది కూడా బాబు వేదిక మీదకు రాక ముందే వెనుదిరగటంతో చంద్రబాబుతోపాటు కార్యక్రమానికి హాజరైన జిల్లా పార్టీ నేతలు తలలు పట్టుకున్నారు. చేసేదేమీలేక చంద్రబాబు ప్రసంగాన్ని కొనసాగించారు. యథాతథంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పైనా, ప్రభుత్వంపైనా విమర్శలు గుప్పించారు. దీంతో సభకు వచ్చిన జనం సంగతి దేవుడెరుగు కూటమి పార్టీల కార్యకర్తల నుంచి కూడా బాబు ప్రసంగానికి స్పందన లేకుండా పోయింది.

జనం లేరని ఆలస్యంగా..

చంద్రబాబు ప్రజాగళం సభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు అంతకుముందు బాపట్ల టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ప్రకటించారు. సభకు 25 వేల మంది వస్తారని పచ్చపార్టీ నేతలు, కార్యకర్తలు ప్రచారం చేశారు. ప్రతిగ్రామం నుంచి జన సమీకరణ చేస్తున్నట్లు చెప్పారు. తీరా చూస్తే ఆదివారం సాయంత్రం ఆరు గంటలు అయినా చంద్రబాబు సభ జరిగే అంబేడ్కర్ సర్కిల్‌కు పట్టుమని మూడువేల మంది కూడా రాలేదు. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం ఆదివారం సాయంత్రం 5:45 గంటలకు చంద్రబాబు బాపట్లలోని బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకొని ఆరు గంటలకు సభలో పాల్గొనాల్సి ఉంది. అయితే ఆయన 6.20 గంటలకు బాపట్ల చేరుకున్నారు. సభకు జనం రాలేదని తెలుసుకొని 7.25 గంటల వరకూ ఇంజినీరింగ్ కళాశాలలో వేచి చూశారు. చంద్రబాబు సకాలంలో సభకు రాకపోవటంతో వచ్చిన జనంలో వెయ్యి మంది వరకూ వెనుతిరిగి వెళ్లిపోయారు. జనం పెరగక పోగా వచ్చినవారూ వెళ్లిపోతున్నారని తెలుసుకొని బాబు రాత్రి 7.29 గంటలకు అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకున్నారు. అయినా బాబు వచ్చినా జనం వెళ్లిపోవడం ఆగలేదు. అప్పటికే సమయాభావం కావటంతో చంద్రబాబు 7.34 గంటలకు ప్రసంగం మొదలు పెట్టి 8.29కి ముగించారు. ఈ లోపు ఉన్నరెండు వేల మందిలో వెయ్యి మంది వెళ్లిపోగా చివరకు వెయ్యిమంది కార్యకర్తలు కూడా మిగల్లేదు. పై పెచ్చు చంద్రబాబు తాము గెలిస్తే ఏమి చేస్తామన్న విషయం పక్కన బెట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. రొటీన్ విమర్శలకు మొహం మొత్తిన కూటమి పార్టీల కార్యకర్తలు బాబు ప్రసంగానికి స్పందించలేదు. అందరూ బాబు సభ ఫెయిల్ కావడంపైనే చర్చించుకోవటం కనిపించింది.

నరేంద్రవర్మకు చివాట్లు..

టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ జనాన్ని సభకు తరలించటంలో విఫలమయ్యారని కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు విమర్శలు గుప్పించారు. చంద్రబాబు తోపాటు ఈ సభకు హాజరైన టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తదితరులు ప్రజాగళానికి జనం రాకపోవడంపై బాపట్ల టీడీపీ నేతలకు చీవాట్లు పెట్టినట్లు సమాచారం. ప్రజాగళం సభకు జనాన్ని తరలించడంలో విఫలం కావడంతో బాపట్ల టీడీపీ అభ్యర్థి వేగేశనను చంద్రబాబు చీవాట్లు పెట్టినట్లు సమాచారం.

కూలి కోసం వచ్చాం..

చంద్రబాబు ప్రజాగళానికి బాపట్ల అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ బాపట్ల సమీపంలోని కొన్ని గ్రామాల నుంచి జన సమీకరణ చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల మహిళలకు కూలి కింద ఒక్కొక్కరికీ రూ.300 చెల్లించారు. తొలుత సభకు వచ్చిన మహిళలు చంద్రబాబు రాక ఆలస్యమవుతుందని తెలుసుకొని బాపట్లకు వచ్చిన మరుక్షణం సొంత గ్రామాలకు వెనుదిరిగారు. తాము చంద్రబాబు మీద ఇష్టంతోనో, పార్టీ మీద అభిమానంతోనో రాలేదని కూలి కోసం వచ్చామని, మస్టర్ వేసుకొని వెళ్తున్నామని పలువురు మహిళలు 'సాక్షి'కి నవ్వుతూ చెప్పారు. తాము చంద్రబాబుకు ఓట్లేసే వారం కామన్నారు. తమ ఓట్లన్నీ రాబోయే ఎన్నికల్లో జగన్‌కే అన్నారు.

రాత్రికి బాబు బాపట్లలో మకాం ....

ఆదివారం రాత్రి ప్రజాగళం సభకు బాపట్ల వచ్చిన చంద్రబాబు రాత్రికి బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో బసచేశారు. సోమవారం ఉదయం ఇక్కడి నుంచి వెళ్తారు.

ప్రజాగళంలో అపశ్రుతి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బాపట్లటౌన్: చంద్రబాబు ప్రజాగళానికి హాజరై తిరిగి వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బాపట్ల పట్టణ శివారు చిల్లర గొల్లపాలెం సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. అప్పికట్ల గ్రామానికి చెందిన కుంచాల రత్తయ్య(52) ద్విచక్ర వాహనంపై అప్పికట్ల నుంచి బాపట్ల వచ్చారు. ప్రజాగళం నుంచి తిరిగి ఇంటికి వెళ్తుండగా చిల్లర గొల్లపాలెం సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పట్టణ ఎస్ఐ రజాక్ కేసు నమోదు చేశారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రత్తయ్య

న్యూస్‌రీల్


గోవర్ధనోద్ధరణ అలంకారంలో నారసింహుడు



మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా ఆదివారం గోవర్ధనోద్ధరణ అలంకారంలో దర్శనమిచ్చారు. స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించగా కైంకర్యపరులుగా మంగళగిరికి చెందిన శనగల రామహనుమాన్, శేషాంజనేయగోపాల్‌లు వ్యవహరించారు. ఆస్థాన కైంకర్యపరులుగా దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామానికి చెందిన వాసిరెడ్డి మల్లేశ్వరరావు(రాజేష్) వ్యవహరించారు.

ప్రభుత్వ చొరవతోనే అబ్రహం రచనలకు జీవం

సినీ నటుడు జీవా



తెనాలిటౌన్: మధురకవి నూతక్కి అబ్రహం రచనలను ప్రభుత్వం చొరవ తీసుకుని వెలుగులోకి తీసుకురావాలని సినీనటుడు జీవా తెలిపారు. ఈస్టర్ పండుగ సందర్భంగా రూరల్ మండలం కొలకలూరులోని సమాధులతోటలో ఆదివారం అబ్రహం సమాధి వద్ద ఆయన నివాళులర్పించారు. జీవా మాట్లాడుతూ అబ్రహం రచనలను ప్రచురించి, నేటి తరానికి తెలియజేయాలన్నారు. మత్కుణం, పాపక్షమ రచనలు ఆయనకు ఎంతో పేరు తెచ్చాయని తెలిపారు. ఆయన వెంట పాపక్షమ నాటక గాయకులు పులి పుష్పరాజు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ప్రతి రోజూ కార్డియాలజీ ఓపీ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో సోమవారం నుంచి ప్రతి రోజూ గుండె జబ్బు రోగులకు ఔట్‌పేషెంట్ విభాగంలో ఓపీ వైద్య సేవలు అందిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. గతంలో వారంలో మూడు రోజులు మాత్రమే ఓపీ వైద్యసేవలు అందుబాటులో ఉండేవన్నారు. జీజీహెచ్‌కు వస్తున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్న దృష్ట్యా సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ కార్డియాలజీ ఓపీ ఉంటుందన్నారు. ఆసుపత్రి ఆవరణలో గతంలో జిల్లా క్షయ వ్యాధి కేంద్రం ఉన్న ప్రదేశంలో కార్డియాలజీ ఓపీ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఓపీ విభాగంలోనే గుండె జబ్బుకు అవసరమైన ఈసీజీ, 2డి ఎకో, ట్రెండ్‌మిల్ టెస్ట్‌లన్నీ కూడా చేస్తారన్నారు. నరాల జబ్బులతో బాధపడుతున్న వారు సైతం అధిక సంఖ్యలో వస్తున్నందున సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రోజూ ఓపీ వైద్యసేవలు ఉంటాయన్నారు. రోగులు ఇబ్బంది పడకుండా వేసవి దృష్ట్యా దాతల సహకారంతో ఏసీ వాటర్ కూలర్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు.

అభ్యుదయ రైతు శ్రీధర్‌కు ప్రతిష్టాత్మక పురస్కారం


3న హైదరాబాద్‌లో ప్రదానం



తెనాలి: ఫార్మ్ ఆఫ్ రూరల్ సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న రైతు అవార్డుల ప్రదానోత్సవంలో తెనాలికి చెందిన అభ్యుదయ రైతు గొట్టుముక్కల శ్రీధర్, ప్రతిష్టాత్మక డాక్టర్ జె.రఘోత్తమరెడ్డి స్మారక అవార్డును స్వీకరించనున్నారు. ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ యూనివర్శిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జె.రఘోత్తమరెడ్డి స్మారకోపన్యాసం, ఉత్తమ రైతులకు అవార్డుల ప్రదానోత్సవాన్ని తెలంగాణకు చెందిన ఫార్మ్ ఆఫ్ రూరల్ సైన్స్ ఫౌండేషన్ నిర్వహిస్తోంది. 2024 సంవత్సరానికి సంబంధించి 3న మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్ బేగంపేటలోని మేరిగోల్డ్ హోటల్‌లో జరగనున్న ప్రత్యేక సభకు నీతి అయోగ్ సభ్యుడు ప్రొఫెసర్ రమేష్‌చంద్ ముఖ్యఅతిథిగా హాజరవుతారు. స్మారకోపన్యాసం అనంతరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురేసి అభ్యుదయ రైతులకు అవార్డులను ప్రదానం చేస్తారు. ఏపీ నుంచి ఎంపికైన ముగ్గురిలో గొట్టుముక్కల శ్రీధర్ ఒకరు. కొల్లూరు మండలం ఈపూరు స్వస్థలం. కొల్లిపర మండలం దావులూరులోని పంటపొలంలో సేంద్రియ విధానంలో దేశవాళీ వరి రకాలను సాగు చేస్తూ రైతులకు అందిస్తున్నారు.

వలంటీర్ల సేవలను అడ్డుకోవడం దురదృష్టకరం

- వేసవిలో వృద్ధులు, వికలాంగులు, మహిళలకు ఇబ్బందులు
- చంద్రబాబు ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారు
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బ్రహ్మానంద రెడ్డి ధ్వజం



మార్టూరు: పెన్షన్ల పంపిణీ విధుల నుంచి గ్రామ వలంటీర్లను దూరంగా పెడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడం దురదృష్టకరమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానంద రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో గ్రామ వలంటీర్లు వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ప్రతి నెల ఒకటో తేదీ ఉదయాన్నే పెన్షన్ సొమ్మును వారి నివాసాలకు వెళ్లి అందిస్తున్నారని పేర్కొన్నారు. వేసవిలో పెన్షన్లు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయకుడు ఒక పక్క వలంటీర్ల వ్యవస్థపై ఫిర్యాదు చేయించడం మరోపక్క తాము అధికారంలోకి వస్తే గ్రామ వలంటీర్లను కొనసాగిస్తానని వేతనాలు ఇస్తానని చెప్పడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని బత్తుల విమర్శించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లను తాత్కాలికంగా విధులకు దూరంగా పెట్టిన నేపథ్యంలో చంద్రబాబు పెన్షనర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలంటూ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయడం విడ్డూరంగా ఉందని చెప్పారు. వృద్ధులు వికలాంగులు ఒంటరి మహిళల సౌకర్యార్థం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ వలంటీర్ల వ్యవస్థపై ఎన్నికల కమిషన్ మరోసారి పునరాలోచన చేసి పెన్షనర్లకు సేవలు అందించే ఏర్పాటు చేయాలని బత్తుల కోరారు.



సీబీజడ్ చర్చిలో ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోన రఘుపతి

పునరుత్థానుడా.. విజయవీరుడా..

క్షమా కేతనం ఎగసింది.. మరణపు ముల్లు విరిగిపోయింది.. సమాధి ఓడిపోయింది.. ఈ భూమ్మీద కక్ష, రాక్షస తత్వాలు ఎంత పేట్రేగినా.. అంతిమ విజయం ప్రేమ, కరుణదేనని చాటి చెప్పింది.. శోకానికి అడ్డుకట్ట తథ్యమని.. హద్దుల్లేని ప్రేమకు ఇదే పట్టాభిషేకమని సందేశమిచ్చింది. శిలువలో బలిదానమైన దైవ కుమారుడు ఏసుక్రీస్తు.. పునరుత్థానం చెందిన ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం క్రైస్తవ లోకం భక్తి ప్రపూరిత హృదయాలతో జరుపుకుంది. సమాధిని గెలిచి లేచిన క్రీస్తు శక్తిని తలపోసుకుంటూ ఆయన దివ్యనామాన్ని స్మరించింది.

–బాపట్ల



ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న సంఘ కాపరి రాహుల్‌దేవ్

డ్రైవర్ల కుటుంబాల ఓట్లతోనే టీడీపీ ఓటమి

- రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం
- నూతన ప్రభుత్వంలో వలంటీర్లతోనే పింఛన్ల పంపిణీ
- బాపట్ల ఎంపీ నందిగం సురేష్, అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ నందిగం సురేష్, పక్కన అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి

అద్దంకి: చంద్రబాబు కించపరచిన డ్రైవర్ల కుటుంబాల ఓట్లతోనే టీడీపీ ఓటమి పాలవడం ఖాయమని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన ఆదివారం రాత్రి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు చల్లగా ఉండటం చంద్రబాబుకు ఇబ్బందిగా ఉందన్నారు. బాబుకు పేదలంటే అలుసని, ఆయన ఎప్పుడూ ఎస్సీలను, డ్రైవర్లను చులకనగా మాట్లాడుతుంటాడని చెప్పారు. శింగనమలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని టిప్పర్ డ్రైవరు, ఎడమచేతితో వేలిముద్ర వేస్తాడని మాట్లాడటం సరికాదన్నారు. గతంలోనూ ఆటో డ్రైవర్లను గురించి మాట్లాడుతూ వారికి పది వేలిస్తే తాగి పడుకుంటారని ఎద్దేవా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బాబూ గుర్తు పెట్టుకో మన రాష్ట్రంలో 30 లక్షల మంది డ్రైవర్లు, వారికి కుటుంబలున్నాయని తెలిపారు. వారందరినీ కించపరచే విధంగా మాట్లాడావు, వాళ్లందరూ తలచుకుంటే నీకు ఒక్క ఓటు కూడా పడదు. నీవు ఇంటికి చేరడం ఖాయమన్నారు. డ్రైవర్లకు నీలాగా వెన్నుపోటు పొడవడం చేతకాదు. మీ మామకు వెన్నుపోటు పొడిచావు. నీకు లాగా మేము చేయలేమన్నారు. రెండు ఎకరాలున్న నీవు లక్షల కోట్లు ఎలా సంపాదించావని ప్రశ్నించాడు.

మళ్లీ సీఎం జగనన్నే..

ఏదో రకంగా ఈ ఎన్నికల్లో నెగ్గి పుత్రరత్నాన్ని ఏదో చేద్దామని, పేదలను తొక్కేసి పెత్తందార్లకు సపోర్టు చేయాలని చూస్తున్నావన్నారు. నీవు గెలవలేవు.. నీ కొడుకు పప్పు అని అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. పింఛన్‌దార్లకు సక్రమంగా పింఛన్ అందడం ఇష్టం లేక కోర్టుకు వెళ్లావు.. గుర్తు పెట్టుకో త్వరలో నిర్వహించనున్న ఎన్నికల్లో మళ్లీ జగన్ గెలిచి సీఎంగా మా ప్రభుత్వంతో వలంటీర్ల చేత పింఛన్ పంపిణీ చేయిస్తామని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి, పరిశీలకుడు మారం వెంకారెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పులికం కోటిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, మండల కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ జజ్జర ఈశ్వరమ్మ ఆనందరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గుంటూరులో ఆస్తి పన్ను రూ.95 కోట్లు వసూలు

- ఒక్క రోజే రూ.3.83 కోట్లు వసూలు
- రాష్ట్రంలో తృతీయ స్థానం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 1,95,906 అసెస్‌మెంట్లకుగాను మార్చి 31 నాటికి రూ.95 కోట్ల వసూళ్లతో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీని నగర ప్రజలు విరివిగా సద్వినియోగం చేసుకున్నారని, పన్ను వసూళ్లలో రాష్ట్ర స్థాయిలో విశాఖపట్నం, విజయవాడ తర్వాత 3వ స్థానంలో గుంటూరు నగరపాలక సంస్థ నిలిచిందన్నారు. సుమారు రూ.20 కోట్ల అన్ కలెక్టబుల్ డిమాండ్‌తో కలిపి మొత్తంగా ఉన్న రూ.143.46 కోట్ల ప్రైవేట్ డిమాండ్ గాను మార్చి 31 నాటికి రూ.95 కోట్లు వసూలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆదివారం ఒక్క రోజే రూ.3.88 కోట్లు వసూలు అయినట్లు చెప్పారు.

సంక్షేమ రథసారథి జగనన్నకు అండగా ఉండాలి

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు




ఈద్గాను దర్శించుకున్న ఎంపీ మోపిదేవి, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్

రేపల్లె రూరల్: సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు కోరారు. పట్టణంలోని 25, 26 వార్డులలో ముస్లింలతో ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేశారని చెప్పారు. నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి నివేశన స్థలాలు అందించారని వివరించారు. అవ్వా తాతలు, దివ్యాంగులకు ఇంటి వద్దకే పింఛన్లు, సంక్షేమ పథకాలు అందజేసేలా సచివాలయం, వలంటీరు వ్యవస్థను తీసుకువచ్చి దేశానికే ఆదర్శప్రాయంగా నిలిచారని గుర్తు చేశారు. జగనన్న నాయకత్వంలోని రేపల్లెలో డాక్టర్ ఈవూరు గణేష్‌కు మద్దతుగా నిలవాలన్నారు. పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ మాట్లాడుతూ ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు సహకారంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించారన్నారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. తొలుత వార్డులోని ఈద్గాలో ప్రత్యేక నమాజులు నిర్వహించారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, పార్టీ నాయకులు షేక్ జమీర్, లియాకత్‌బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిపొందిన ముస్లిం మహిళలు మాట్లాడారు.

చంద్రబాబు, పవన్ విమర్శలతోనే వలంటీర్ల సేవలకు అంతరాయం

రేపల్లె రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న గ్రామ వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ విమర్శలతోనే వలంటీర్ల సేవలను ఎన్నికల కమిషన్ దూరం చేసిందని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మంచిని చూసి ఓర్వలేకనే విమర్శలకు దిగినట్లు చెప్పారు. వలంటీరు వ్యవస్థతో ప్రజలకు జరుగుతున్న మంచిని చేసి ఇతర రాష్ట్రాలె అమలు చేయాలని పనితీరును పరిశీలించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను చూడకుండా సేవా దృక్పథంతో వలంటీరు సేవలను చూడాలని విజ్ఞప్తి చేశారు. వలంటీరులను ఈ రెండు నెలలు విధులకు దూరంగా ఉంచడటంతో దివ్యాంగులతో పాటు అవ్వాతాతలు అనేక ఇబ్బందులను ఎదుర్కొనాల్సిన పరిస్థితులు నెలకొంటాయన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ తన రాజకీయ స్వార్థం కోసం పవన్‌కళ్యాణ్ కాపు కులాన్ని చంద్రబాబు నాయకుడు కాళ్ల వద్ద తాకట్టుపెట్టాడని విమర్శించారు. రాష్ట్రంలో ఓటు హక్కులేని చంద్రబాబు, పవన్ రాష్ట్ర ప్రజలపై కపటప్రేమను కురిపిస్తున్నారన్నారు. ఇకపై పిఠాపురంలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటానని పవన్‌కల్యాణ్ ప్రకటించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. సామాజిక న్యాయం పాటిస్తూ రాజకీయంగా కాపులకు పెద్దపీట వేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి కాపులు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, పార్టీ నాయకులు తలశిల శ్రీనివాసరావు, మేడికొండ సుధాకర చంద్రహాసరావు, రావు ప్రభాకరరావు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్ జగనే సీఎం



మళ్లీ వైఎస్ జగన్‌నే సీఎంని చేసుకుంటాం. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ప్రజలకు మంచి చేసే నాయకుడు పదికాలాలపాటు ప్రజలతోనే ఉంటాడు. ఆసరా పథకం ద్వారా లబ్ధిపొందటంతో పాటు నివేశన స్థలం వచ్చింది. రేషన్, పింఛన్ ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్న జగనన్న ప్రభుతానికి అండగా నిలుస్తాం.

–బూబమ్మ, 26వ వార్డు, రేపల్లె

క్లుప్తంగా

'గేట్' ర్యాంకర్‌కు 'మానవత' సత్కారం



తెనాలి: ఎంటెక్‌లో ప్రవేశం కోసం నిర్వహించే గేట్ పరీక్షల్లో అఖిల భారత స్థాయిలో 10వ ర్యాంక్ సాధించిన కొలెవరం విద్యార్థి యర్రు లక్ష్మీ సాయికృష్ణను తెనాలి స్వచ్ఛంద సేవా సంస్థ మానవత ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. కొలెవరంలోని విద్యార్థి నివాసానికి సంస్థ తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ సాయికృష్ణను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. అతడి విజయం తెనాలికి గర్వకారణమన్నారు. మానవత ఎగ్జిక్యూటీవ్ ప్రెసిడెంట్ కల్యాణి రవీంద్రనాథ్ మాట్లాడుతూ సాయికృష్ణ విజయం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. వీఎల్ఎస్ఐ టెక్నాలజీ అనుభవంతో స్వయంగా ఒక సంస్థను నెలకొల్పి ఉపాధి అవకాశాలు కల్పించాలనేది తన భావనగా సాయికృష్ణ వెల్లడించారు. మానవత బాధ్యులు డీవీ సోమయ్యశాస్త్రి, ఓంకార్ ప్రసాద్, ఎస్‌వీ శర్మ, వేదాంతం ఫణీంద్ర, పి.శ్రీనివాస్, ఎ.కృష్ణకుమార్, పి.వెంకట్, ఎ.రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

తెనాలిరూరల్: తెనాలి – రేపల్లె మార్గంలో వైకుంఠపురం రైల్వే వంతెనపై శనివారం రాత్రి ఓ మహిళను రైలు ఢీ కొట్టింది. సదరు మహిళ వంతెనపై నుంచి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో ఒక్కసారిగా పైనుంచి పిల్లర్‌పై పడి, అక్కడి నుంచి రోడ్డు మీద పడిన మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటాయని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇద్దరికి గాయాలు

గురజాల : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం....కారంపూడి మండలంలోని మిరియాలకు చెందిన గారపాటి పోతురాజు కొద్ది రోజులుగా గురజాలలో అక్క వద్ద ఉంటున్నాడు. ఈస్టర్ పండుగను పురస్కరించుకుని గురజాల నుంచి దాచేపల్లికి స్నేహితులైన డొక్కా ప్రణీత్ బాబు, లింగాల కిశోర్‌లతో కలసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గం మధ్యలో అంబాపురం శివారులో గల పాత పాటేశ్వరి కోల్డ్ స్టోరేజ్ సమీపంలో నిలబడి ఉన్న గుర్తు తెలియని వాహనాన్ని వేగంగా వెళ్లి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గారపాటి పోతురాజు (18) తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. డొక్కా ప్రణీత్ బాబు తలకు బలమైన గాయం కాగా, లింగాల కిశోర్ చేతికి గాయమైంది. బాధితులను తొలుత 108 వాహనంలో గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. అక్కడ నుంచి నరసరావుపేటకు తరలించారు.

ఓటమి భయంతో కూటమి కుటిల రాజకీయాలు

- పేదలకు వలంటీర్ల సేవలు దూరం చేసిన చంద్రబాబు
- బాపట్ల ఎంపీ నందిగం సురేష్
- అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డితో కలిసి కొప్పరపాడులో ఎన్నికల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న ఎంపీ సురేష్, అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి

బల్లికురవ: మూడు పార్టీలు ఏకమై పెత్తందార్ల పంజా విసిరి అవ్వా తాతలకు వలంటీర్ల ద్వారా అందాల్సిన పింఛన్‌లు నిలుపుదల చేయించినా.. ప్రజల హృదయాల్లో సీఎం జగన్ చెరగని ముద్ర వేసుకున్నారని బాపట్ల ఎంపీ నందిగం సురేష్, అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పాణెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి మండలంలోని కొప్పరపాడు గ్రామంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నీ అమలు చేసి జగనన్న సుపరిపాలన అందించారని అన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందని గడపే లేదన్నారు. గ్రామాల వారీగా ప్రజలంతా జగనన్న వైపే ఉన్నారని అన్నారు. ప్రజలకు మంచి జరుగుతుంటే ఓర్వలేని ఎల్లో మీడియా విషపు రాతలు రాస్తోందని ఇదంతా ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు.

అద్దంకి అభివృద్ధికి కృషి

అద్దంకి అభివృద్ధికి పాటు పడ్డానని రాబోయే కాలంలో హనిమిరెడ్డి సహకారంతో మరింత అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ సురేష్ ప్రకటించారు. చంద్రబాబు, లోకేష్, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ మోస పూరిత హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో మేలు జరిగిందని భావిస్తే ఎంపీ అభ్యర్థిగా తనకు, అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి హనిమిరెడ్డికి ఫ్యాన్ గుర్తుపై రెండు సార్లు బటన్ నొక్కి ఆశీర్వదించాలని కోరారు. ప్రజలిచ్చే ఆశీర్వాదంతో జగనన్న రెండోసారి ముఖ్యమంత్రి కావడంతో సంక్షేమ పథకాలన్నీ యథాతథంగా కొనసాగుతాయన్నారు. మూడు పార్టీల కూటమికి ఓట్లు వేస్తే సంక్షేమ పథకాలను రద్దు చేస్తారని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మొదటిసారి గ్రామంలోకి వచ్చిన ఎంపీ నందిగం సురేష్‌కు, పాణెం చిన హనిమిరెడ్డికి గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. మేళతాళాలు, డప్పువాయిద్యాలు, డీజేలతో స్వాగతం పలికారు. గ్రామంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ముద్దపాటి శంకర్, గ్రామ సర్పంచ్ బండారు వెంకాయమ్మ గురవయ్య, వల్లాపల్లి సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి, స్థానిక నేతలు మక్కెన వెంకట రామారావు, ఎం దానానాయక్, బుర్రి ఆదినారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల సందడి

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి యున్న తిరుపతమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ నుంచి సైతం వందలాది వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు వాహనాల రద్దీ కొనసాగింది. గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో పొంగళ్లతో భక్తులు

రైతులను ప్రలోభపెడుతున్న ధూళిపాళ్ల

- మూడు నెలల పాటు సంగం డెయిరీ బాధ్యతల నుంచి తప్పించాలి
- సంగం, డీవీసీ ట్రస్టుల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేయాలి
- వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ



మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ఎన్నికల సమయంలో సంగం డెయిరీకి సంబంధించిన పాడి రైతులను ప్రలోభాలకు గురిచేస్తున్న డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రను ఆ బాధ్యతల నుంచి మూడు నెలల పాటు తప్పించాలని వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఎన్నికల అధికారులను కోరారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం పొన్నూరు ఎమ్మెల్యే, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థిగా ఉండి సంగం డెయిరీ చైర్మన్, డీవీసీ ట్రస్టు హాస్పిటల్ బాధ్యతలు నిర్వహించడంతో అక్రమాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో మూడు నెలల పాటు సంగం డెయిరీ బాధ్యతల నుంచి ధూళిపాళ్లను తప్పించాలని తాను ఎన్నికలు కమిషన్‌కు ఫిర్యాదు చేశానన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ధూళిపాళ్ల నరేంద్ర రైతులను కోరుతున్నట్లు తాను ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లు అంబటి తెలిపారు. అంతేకాక, సంగం డెయిరీలో శనివారం నిర్వహించిన బోర్డు సమావేశంలో నరేంద్ర తెలుగుదేశం పార్టీ గుర్తు సైకిల్ బొమ్మ కలిగిన టీ షర్టు ధరించి కూర్చున్నారన్నారు. అదే సమయంలో కొందరు వ్యక్తులకు బహుమతులు కూడా అందజేశారన్నారు. ప్రధానంగా రైతులకు బోనస్ విడుదల చేయడం, తిరిగి ఆ బోనస్‌ను రైతుల నుంచి ఎన్నికల ఖర్చు కోసం తీసుకోవడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీటికి సంబంధించి ఆధారాలు తన వద్ద ఉన్నాయని అంబటి పేర్కొన్నారు. గత గురువారం ధూళిపాళ్ల స్వగ్రామం చింతలపూడిలోని ఓ రైస్ మిల్లులో ఓటర్లకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచిన సైకిళ్లు పట్టుబడిన సంఘటనను కూడా పరిగణనలోకి తీసుకుని ఎన్నికల కమిషన్ తగిన చర్యలు చేపట్టాలని కోరారు. టీడీపీ హయాంలో చేబ్రోలు మండలంలో జరిగిన భూ దోపీడీపై శాటిలైట్ సర్వే ద్వారా నిజ నిర్ధారణ చేద్దామని సవాల్ విసిరితే నేటికీ ధూళిపాళ్ల నుంచి స్పందన లేదని విమర్శించారు.

జగనన్న సంక్షేమ పథకాలే ప్రచార అస్త్రాలు

- పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ
- కారంచేడు మండల నాయకులతో ఆత్మీయ సమావేశం



నాయకులతో చర్చిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

కారంచేడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలనే ప్రచార అస్త్రాలుగా చేసుకొని వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఎన్నికల బరిలోకి దిగాల్సి ఉందని వైఎస్సార్ సీపీ పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. ఆదివారం ఆయన కారంచేడు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులతో చీరాలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఐదు సంవత్సరాల కాలంలో జగనన్న పేద ప్రజలు, అవ్వా, తాతలకు అందించిన అనేక రకాల సంక్షేమ పథకాలు, గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయన్నారు. జగనన్న అందించిన సుపరిపాలనను చూసిన ప్రజలు మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాలనే సంకల్పంతో ఉన్నారన్నారు. గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు అందరూ కలసి సమష్టిగా పనిచేసి మళ్లీ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండాను పర్చూరులో ఎగురవేయడమే లక్ష్యంగా పని చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, పర్చూరు ఏఎంసీ మాజీ చైర్మన్ జువ్వా శివరామప్రసాద్, ఉప్పలపాటి అనీల్, మాజీ వైస్ ఎంపీపీ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కొడాలి ధర్మానందరావు, గోగినేని బుల్లెబ్బాయి, దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, భవనం వెంకటేశ్వరరెడ్డి, గోగినేని సతీష్‌కుమార్, భవనం శ్రీరామరెడ్డి, కొణిదెల రాజకుమారి, చిన్న, మాదాసు కుమారి, తోటకూర శ్రీనివాసరావు, బోడావుల హరిబాబు, సుబ్రమణ్యం, సీహెచ్ సుబ్బయ్య, టీ చింపిరమ్మ, నూర్‌బాషా, మీరయ్య, గుదిబండి నాగిరెడ్డి, ఎం నాగేశ్వరరావు, కుంభా సుజాత, నాయకులు పాల్గొన్నారు.

శెనగకోత యంత్రంలో పడి యువకుడి మృతి

- పుట్టిన రోజు నాడే మృత్యువు ఒడిలోకి
- వల్లూరులో విషాద ఘటన



లక్ష్మీ నర్సింహనాయుడు (ఫైల్)

వల్లూరు(కాకుమాను): ప్రమాదవశాత్తూ శెనగ కోత యంత్రంలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వల్లూరులో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవీంద్ర అందించిన వివరాల మేరకు వట్టిచెరుకూరు మండలం కారంపూడిపాడు గ్రామానికి చెందిన తోటకూర సుబ్బారావు తన కుమారుడు తోటకూర లక్ష్మీ నర్సింహనాయుడు(20)తో కలిసి ఆదివారం ఉదయం వల్లూరు గ్రామంలోని వారి పొలంలో శెనగ పంటను కోసేందుకు యంత్రంతో వెళ్లారు. ఉదయం నుంచి తోటి కూలీలతో ఎంతో సరదాగా పని చేసిన యువకుడు కొన్ని గంటల వ్యవధిలోనే కానరాని లోకాలకు వెళ్లడంతో తోటి కూలీలు శోకసంద్రంలో మునిగిపోయారు.

పుట్టిన రోజునాడే విషాదం

మృతుడు నర్సింహనాయుడు ఆదివారం పుట్టినరోజు కావడంతో ఆదివారం ఉదయం తోటి కూలీలకు పొలంలో స్వీట్లు పంపిణీ చేశాడు. అంతా ఆనందంగా ఉన్న గంట వ్యవధిలోనే కోత యంత్రం రూపంలో మృత్యువు ఆ యువకుడిని కబళించింది. ఉదయం నుంచి తోటి కూలీలతో సరదాగా పని చేస్తూ గడిపిన యువకుడు కోత మిషన్‌లో శెనగ పంటను వేసే క్రమంలో ప్రమాద వశాత్తు యంత్రంలో పడి మృతి చెందాడు. మృతుని తండ్రి సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని బాపట్ల ప్రజా వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ రవింద్ర తెలిపారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌బాబు

పల్లెకోన(భట్టిప్రోలు): రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వేమూరు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీల నుంచి భారీగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. ఆదివారం రాత్రి భట్టిప్రోలు మండలం పల్లెకోనలో నిర్వహించిన కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీల వారు రాచూరు నుంచి 10 కుటుంబాలు, ఆళ్లమూడి నుంచి 5 కుటుంబాలు, పల్లెకోన నుంచి 100 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో అశోక్‌బాబు సమక్షంలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఈ మూడు గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు బొల్లెద్దు ప్రతాప్, జయవరపు రాధాకృష్ణమూర్తి, పెద్దిశెట్టి రాంబాబు, ఉప సర్పంచులు చిల్కా రత్నబాబు, ఆళ్లమూడి వెంకయ్య, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దిశెట్టి వెంకటేశ్వరరావు, రెబ్బా మున్ని తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలకు పాల్పడే వ్యక్తి అరెస్ట్

రూ.1.30 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన జీఆర్పీ ఎస్సై వెంకటాద్రి, సిబ్బంది

లక్ష్మీపురం: రైళ్లలో ప్రయాణికులు నిద్రించిన సమయంలో సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌ట్యాప్, ద్విచక్ర వాహనాలు చోరీ చేసే వ్యక్తిని గుంటూరు రైల్వేస్టేషన్ 1వ నంబరు ప్లాట్‌ఫాంపై జీఆర్పీ పోలీసులు అరెస్ట్ ఆదివారం చేశారు. రైల్వే జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు గుంటూరు డివిజన్ రైల్వే డీఎస్పీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో గుంటూరు జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జీఆర్పి ఎస్సై జి.వెంకటాద్రి, పి.రమేష్ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌ల 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు చేస్తున్న సమయంలో ప్లాట్‌ఫాంపై ఒక యువకుడు అనుమాస్పదంగా కనిపించాడు. అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను పరిశీలించగా సెల్‌ఫోన్‌లు దొరికాయి. దీంతో ఆ యువకుడిని జీఆర్పీ స్టేషన్‌కు తరలించి, విచారించారు. ఆ యువకుడు పల్నాడు జిల్లా మాచర్ల మండలం, తాళ్లపల్లి గ్రామానికి చెందిన దేరంగుల రాజు అనే వ్యక్తిగా గుర్తించారు. రైళ్లలో ప్రయాణికులు నిద్రించే సమయంలో సెల్‌ఫోన్‌లు, బ్యాగులు, విలువైన వస్తువులను చోరీ చేస్తుంటాడని విచారణలో తెలుసుకున్నారు. అతని వద్ద ఉన్న ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌లు ఇలా సుమారు రూ.1.30 లక్షల విలువ చేసే వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. తనిఖీల్లో సహకరించిన కానిస్టేబుల్ వలి, సుభాని, నాగరాజు, శ్రీనివాస్, ఎస్సై వెంకటాద్రిని అభినందించారు.

డంపింగ్ యార్డులో కాలిపోయిన మహిళ మృతదేహం

- తెనాలి మండలం సంగం జాగర్లమూడిలో ఘటన
- దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రమేష్, సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది

తెనాలిరూరల్: కాలిపోయిన మహిళ మృతదేహం తెనాలిలో కలకలం రేపింది. తెనాలి – గుంటూరు ప్రధాన రహదారి మార్గంలో సంగం జాగర్లమూడి వద్ద ఆదివారం ఉదయం ఓ గుర్తు తెలియని యువతి మృతదేహం వెలుగు చూసింది. శ్రీ సంగమేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్లే మార్గంలో పంచాయతీ డంపింగ్ యార్డ్ వద్ద పూర్తిగా కాలిపోయిన స్థితిలో సుమారు 20 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు గల మహిళ మృతదేహం పడి ఉండటం గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది ఉదయం గుర్తించారు. వెంటనే తెనాలి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ ఎం. రమేష్, రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ పి.కోటేశ్వరావు ఘటనా స్థలానికి చేరుకుని, దర్యాప్తు చేపట్టారు. స్థానికుల సహా పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్నం ఘటనా స్థలానికి చేరుకున్న క్లూస్ టీం సిబ్బంది, డాగ్ స్క్వాడ్ ఆధారాలు సేకరించే ప్రయత్నం చేసినా.. సరైన ఆధారాలు లభించలేదు. కనీసం మృతురాలు ఎవరు, ఏ ప్రాంతానికి చెందిన మహిళ అన్న వివరాలూ తెలియలేదు. మృతదేహం కుడి చేతికి 10 గాజులు, ఎడమ చేతికి పింక్ కలర్ వాచ్చి, మెడలో తాడుకు వెంకటేశ్వర స్వామి, ఆంజనేయస్వామి బొమ్మలు కలిగిన లాకెట్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతురాలు ఎరుపు రంగు పంజాబీ వస్త్రాలు ఉన్నట్లు భావిస్తున్నారు. ఎత్తు మాత్రం కేవలం 4.5 అడుగులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

అయితే వేరే ప్రదేశంలో హత్య చేసి, ఇక్కడకు తీసుకు వచ్చి దహనం చేశారా? లేక ఘటన స్థలంలోనే హతమార్చి తగలబెట్టారా? అన్న కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. దీనిపై రూరల్ సీఐ వెంకటేశ్వర్లు స్పందిస్తూ.. మహిళ మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు గ్రామంలోని పలువురిని విచారిస్తున్నట్లు చెప్పారు. మహిళ దహనంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వేడి నీటిని పోసి భర్తపై భార్య హత్యాయత్నం



చికిత్స పొందుతున్న ప్రభుదాసు

వినుకొండ టౌన్: నిద్రిస్తున్న భర్తపై వేడి నీటిని పోసి భార్య హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలోని హనుమాన్ నగర్ 13వ లైనులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం గ్రామానికి చెందిన నాయిని ప్రభుదాసు, అనూషాలు గత కొన్ని రోజుల నుంచి పట్టణంలోని హనుమాన్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. అయితే, కుటుంబ కలహాలతో ఇద్దరు వేర్వేరుగా ఉంటున్నారు. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ చేసి అనూష తల్లిదండ్రులు కాపురానికి పంపారు. ప్రభుదాసు నెలవారి వాయిదాల పద్ధతిలో వినుకొండ పట్టణంలో వ్యాపారం చేసుకుంటూ, ఇటీవల భార్యను తీసుకొచ్చాడు. ఈ క్రమంలో లుంగీ కట్టుకొని నిద్రిస్తున్న ప్రభుదాసుపై మసిలే నీటిని పోయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రభుదాసు ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, అనూషను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసుల తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సుముహూర్తాన ఒక్కటైన నూతన వధూవరులు పెళ్లి దుస్తులపై అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. నూతన వధూవరులతో పాటు వారి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం కనిపించింది. పలు ఆర్జిత సేవల్లో ఉభయ దాతలతో పాటు నూతన వధూవరులు పాల్గొన్నారు. ఖడ్గమాలార్చాన, శ్రీచక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, శాంతి కల్యాణంతో పాటు చండీహోమంలో ఉభయ దాతలు విశేషంగా పాల్గొన్నారు.

సాయంత్రం విశేష సేవలు..

ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమైన రద్దీ ఉదయం 10 గంటల వరకు కొనసాగింది. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అర గంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మళ్లీ పెరిగింది. 12.20 గంటలకు మళ్లీ దర్శనాలు ప్రారంభం కాగా భక్తులతో క్యూలైన్లలో రద్దీ కనిపించింది. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు మహా మండపం రెండో అంతస్తులో అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ, పల్లకీ సేవలో ఉభయ దాతలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు. దాత బొబ్బ లోహిత, దుర్గగుడి ఏఈ సునీల్ కుమార్ కుటుంబం పేరిట 5 క్యాన్ల మజ్జిగను పంపిణీ చేశారు. అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో భక్తులు మజ్జిగను స్వీకరించేలా దేవస్థానం ఏర్పాట్లు చేసింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మజ్జిగ వితరణ చేశారు.